# పశ్చాత్తాపం

**దివ్య చక్కటి చీర కట్టుకుని, సిగలో పూలు పెట్టుకుని, సెంటు పూసుకుని, ఆఫీసు నుండి రాబోయే భర్త కోసం ఎదురు చూస్తోంది.**

**దివ్య- వర్ధన్ ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. పెళ్ళి కూడా పెద్దల ఆమోదంతోనే సంప్రదాయబద్ధంగా జరిగింది.**

ఆరేళ్ళు గడిచాయి, ఇద్దరు పిల్లలు.

సంసార బాధ్యతతో, సన్నబడినా దివ్య అందం తగ్గలేదు. తెలుపు రంగుతో, వంకీలు తిరిగిన జుత్తుతో, ఒకే మడత కనిపించిన నడుముతో, ఏర్చి కూర్చిన అవయవాల అమరిక అందరికీ చూడముచ్చటే! ఆ అందం భర్తకి సొంతం.

సాయంత్రమయ్యింది. ఆఫీసు నుండి ఇంటికి వచ్చాడు వర్ధన్.

ఎదురుగా చూసి, నిర్ఘాంతపోయి గుమ్మంలోనే నిలుచున్నాడు.

"ఏమిటోయ్ ఈ వింత?" కొంతసేపటికి తేరుకుని అడిగాడు.

"ఎప్పుడూ చింపిరి జుత్తుతో, మాసిన చీరతో, చింకి చేటలా వున్న నా అవతారాన్ని గూర్చి తిట్ల దండకం చదివేవారు. మీరే కదా ఇలా వుండాలని చెప్పారు" బిక్కమొహం పెట్టుకుని, ముద్దుగా పలికిన భార్య మాటలు విని పులకించిపోయాడు వర్ధన్.

సమయం రాత్రి పదయ్యింది.

భర్త పక్కకి చేరింది దివ్య.

మల్లెల వాసన-సెంటు వాసన పోటీ పడుతున్నాయి.

వారం రోజుల్నుండీ భార్య ఒంటి మీద చెయ్యి వెయ్యని వర్ధన్ ఆవేశపడ్డాడు.

ఆ రాత్రి ఇద్దరికీ మధురరాత్రిగా మిగిలింది.

"ప్రతి రాత్రీ ఇలా మార్చగూడదూ.."

దివ్య ముసి ముసిగా నవ్వుతూ "పగలంతా పని వత్తిడితో అలసిపోతాము. మీకదే ధ్యాస" అంది.

"దివ్యా నాదొక్క చిన్న కోరిక"

"ఏమిటో చెప్పండి"

"ఎప్పటి నుండో సిగరెట్టు కాల్చాలని, మందు పుచ్చుకోవాలని కోరిక నాలో బలంగా నాటుకుంది" తప్పని తెలిసినా తడబడుతూ అడిగాడు వర్ధన్.

భర్త వాలకాన్ని ఎగా, దిగా చూసి "చూడండి పెళ్ళికి ముందు అబ్బాయికి ఏ వ్యసనాలూ లేవని పిల్లనిస్తారు. పెళ్ళయిన తర్వాత వ్యసనాలు వస్తే ఆ తప్పు ముమ్మాటికీ భార్యదే! ఏమంటారు? వ్యసనమనేది జీవితంలో ఒక్కసారి అంటిందంటే, జీవితాంతం విడిచి వెళ్ళదు అంత విశ్వాసం గలది. ఆరోగ్యానికి కీడు చేస్తాయని తెలిసినా, డబ్బులు తగలేసి జబ్బులు కొని తెచ్చుకుంటారు. సరే మీ కోరిక నేనెందుక్కాదనాలి? ఒక్కసారికి ఓ.కే."

భార్య అనుమతితో వర్ధన్‌లో ఆనందం రంకెలు వేసింది.

సాయంత్రం ఇల్లు చేరాడు. రాత్రికి తన కోర్కె నెరవేరబోతుందని సంబరపడ్డాడు.

దివ్య పక్క గదిలో పిల్లల్తో పడుకుంది.

వర్ధన్ సిగరెట్టు మీద సిగరెట్టు కాల్చాడు. అలవాటులేని మందు ఎక్కువగానే పుచ్చుకున్నాడు. ఉక్కిరి బిక్కిరయ్యాడు.

కోరిక తీరింది, సగం రాత్రి గడిచింది.

చెప్పలేని దగ్గు, కక్కులు పట్టుకున్నాయి.

దివ్య లేచి భర్తకి సేవలు చేసి, మగతగా ఉన్న అతన్ని మరో మంచమ్మీద పడుకోబెట్టి, గదంతా కడుక్కుంది.

ఆ మగతలో కూడా "దివ్యా..నువ్వు సాలా గేట్..సాలా గేటే!" పొగడ్తలకి కొదువ లేదు.

"ఆ..ఆ..గ్రేట్! మగాళ్ళు చేసిన తప్పులకి కూడా మమ్మల్నే శిక్ష అనుభవించమని ఆడాళ్ళకి భగవంతుడు కల్పించిన భాగ్యమిది" ఇల్లంతా శుభ్రం చేసుకుని అప్పుడు నిద్రకుపక్రమించింది.

తెల్లవారింది.

రాత్రి జరిగినదానికి క్షమాపణ చెప్పాడు వర్ధన్.

"మనలో మనకి క్షమాపణలేమిటండి?"

"నేనేదో దిక్కుమాలిన కోరిక కోరితే నువ్వెందుకు ఒప్పుకున్నావు" అడిగాడు.

"ఆడదానికి భార్య స్థానం బాధ్యతతో కూడి వుంటుందండి. అప్పుడే సంసారానికి అర్థం- జీవితానికి ఆనందం. మనిషిలో దుష్ట కోరిక రాకూడదు. అది తీరకుండా అడ్డుపడితే, మనిషిని దహించివేస్తుంది. ఆ మనిషిలో తర్కం పుడుతుంది. మీరన్నదానికి సరే అన్నాను గనుక ఇంట్లో చేసారు. అదే బయట చేసుంటే మన పరువు కాస్తా బజారు పాలయ్యేది కాదా? ఇప్పుడు వుయ్ ఆర్ హేపీ" దివ్య మాటలు దివ్యంగా విన్పించాయి.

"రియల్లీ యూ ఆర్ ఏ గ్రేట్" ముద్దుల వర్షం కురిపించాడు వర్ధన్.

"కొత్త కోరికలకి చిగురులు తొడక్కుండా వుంటే చాలు" మూతి విరుచుకుని వంటింట్లోకి నడిచింది.

సంసారం సాఫీగా నడుస్తోంది.

ఆనందంగా రోజులు దొర్లాయి.

"దివ్యా నిన్నొకటి అడగాలనుకుంటున్నాను" భర్త అనేసరికి, దివ్య గుండె గుభేలుమంది.

"ఏమిటో చెప్పండి?" సన్నని గొంతుతో నీరసంగా అంది.. చాలా రోజుల తర్వాత కొత్త కోరికలేమిటొచ్చాయోనన్న బెంగతో.

"ఒకప్పటి గర్ల్‌ఫ్రెండ్ కన్పించి, ఏమండీ సినిమాకి వెళ్దాం రండి అంది" సిగ్గు, బిడియాన్ని వదిలేసినట్టు అడిగాడు.

"సిగ్గు విడిచి అలా రమ్మన్నారంటే మహా ప్రమాదం. సరదాలకి-షోకులకి మనల్ని బలి చేస్తారు. ఇది వాళ్ళ తప్పుకాదు. మన బలహీనతని వాడుకుంటారు వాళ్ళు. సంప్రదాయ విలువల్ని మనం కాపాడితే, మన విలువ మనకి దక్కుతుంది. సమాజం అపసవ్యంగా వుందని, మనం అపసవ్యంలో పడి కొట్టుకుపోగూడదు. సినిమాకే కదా, మరే షికారుకీ వద్దు..వెళ్ళండి"

భార్య పర్మిషనుతో పరుగెత్తుకు వెళ్ళాడు గర్ల్‌ఫ్రెండయిన మాలతి ఇంటికి ఆవేశంగా.

వర్ధన్‌ని చూడగానే మాలతి రౌద్రరూపం దాల్చింది. "ఆడవాళ్ళంటే ఏమనుకుంటున్నారు? పరిచయముందని ఆప్యాయంగా మాట్లాడేసరికి, అదే ఆసరాగా తీసుకుని వక్రమార్గంలో ఆలోచించడానికి మీకు మనసెలా వచ్చిందండి? ఈ కోరికే మీ భార్యకొస్తే? మీ గతి కుక్కలు చింపిన విస్తరే!" చెడా మడా దులిపేసింది.

చెమటలు పట్టిన ముఖాన్ని తుడుచుకుని వడి వడిగా ఇంటికి అడుగులు వేసాడు.

'ఆడదాని మనసు అర్థం చేసుకోలేదు, గాయపరిచానేమో? మాలతి రమ్మనకుండానే మాట, మాట కలిపి వెళ్ళినందుకు చెంప ఛెళ్ళు మన్పించేటట్టు చెప్పింది. వెధవ కోరికలకి చోటివ్వగూడదు..' అనుకుంటూ ఇల్లు చేరాడు వర్ధన్.

"ఏమండీ సినిమా కోరిక తీరిందా?" దివ్య అడిగింది.

కొరడాతో కొట్టినట్లున్నాయి ఆ మాటలు.

"కోరికా? పాడా? భార్య, పిల్లల్ని పెట్టుకుని వెధవ కోరికలు పుడితే, తగ్గని జబ్బులు తప్పక వస్తాయి. అలాంటి విపరీతాలకి పోనిక" అన్నాడు వర్ధన్.

పశ్చాత్తాపం అతనిలో వచ్చింది.

ఆ మాలతి, దివ్య స్నేహితురాలేనన్న విషయం వర్ధన్‌కి ఎప్పటికీ తెలీదు.

భార్యతో ప్రతీ రాత్రి మధురరాత్రే!

**-సిహెచ్.డి.లక్ష్మణరావు**
**(విజయనగరం)**